విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 23, జనవరి 2023

జగనన్న కాలనీల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర - ప్యాపిలి : రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో, జగనన్న కాలనీల లబ్ధిదారుల సమస్యలు తక్షణమే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ పోరబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్యాపిలి పట్టణంలో జగనన్న కాలనీల నిర్మాణంలో ఉన్న గృహాలను ఆయన సందర్శించారు. లబ్ధిదారులతో కాలనీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇసుక ఉచితంగా ఇస్తున్నారని చెప్పడమే తప్ప ప్రతి లబ్ధిదారులతో ఒక ట్రాక్టర్ లోడుకు 1000రూపాయలు వసూలు చేస్తున్నారని అంతే కాకుండా గృహాలకు నిర్మించేందుకు నీళ్లు లేవని లబ్ధిదారులు తెలిపారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కొరకు లక్ష 80వేల రూపాయలు ఇస్తుందని అవి ఏమాత్రం సరిపోవని లబ్ధిదారులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 17నుంచి ఇంటి సమస్యల కోసం పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన అన్నారు. జగనన్న కాలనీలో పరిస్థితి రాష్ట్రంలో మరింత అధ్వానంగా ఉందని కాలనీలలో త్రాగునీరు, అంతర్గత రహదారులు, విద్యుత్తు, డ్రైనేజ్ కనీస మౌలిక వసతులు లేవని ప్రభుత్వం పేదవారికి ఇల్లు నిర్మిస్తామని చెప్పి ఈరోజు ప్రభుత్వం మోసం చేస్తుందని ఆయన విమర్శించారు. అధికారంలోకి రాకముందు పేదవాళ్లకు సొంతింటి కల సాకారం చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే దానికి భిన్నంగా ఒక సెంటు స్థలం ఊరికి దూరంగా ఇచ్చి ఇల్లు నిర్మించుకో వాలని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే లబ్ధిదారులకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు స్థలం కేటాయించి ఇల్లు నిర్మించుకునేందు కు 5లక్షల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల లబ్ధిదారులతో ఈనెల 31న సంతకాల సేకరణ చేసి ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఫిబ్రవరి 22న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనా యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి సుంకయ్యలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దగా కోరు ప్రభుత్వమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట చెప్పడమే తప్ప ఆచరణలో లేదని లబ్ధిదారులను సెంటు స్థలం ఇచ్చి వారిని అంతే కాకుండా ఇసుక ట్రాక్టర్ లోడ్ 8వేల రూపాయలు మార్కెట్లో ఆ రేటు ఉందని పేదవాళ్లు ఇసుక కొనాలంటే చాలా ఇబ్బందులు గురవుతున్నారని ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నామని చెప్పడమే తప్ప ఆచరణలో లేదని వారు ఎద్దేవా చేశారు. ప్రభుత్వం తక్షణమే ఇసుక, సిమెంటు ఉచితంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేషు పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేశు, డోన్ మండల కార్యదర్శులు పులిశేఖర్, నారాయణ, మహిళా సమైక్య నాయకురాలు సుగుణమ్మ, ఏఐటీయుసీ నాయకులు అబ్బాస్, సురేంద్ర, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కండి

విశాలాంధ్ర-డోన్ : పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో చిగురుమాంపేట శాఖ సమావేశంశాఖ శాఖ కార్యదర్శి అబ్బాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ మండల కార్యదర్శి ఎస్.పుల్లిశేఖర్, పట్టణ కార్యదర్శి బినారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సుగుణమ్మ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎస్ లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ,నిత్యవసర వస్తు ధరలు పెంచుకుంటూ పోతున్నారన్నారు. పేద, బడుగు,బలహీన వర్గాల మధ్య తరగతి పేద ప్రజలు ఏ విధంగా కొని తిని జీవనం కొనసాగిస్తారని వారన్నారు. పాలకులు అధికారం లోకి రాకముందు ఒకరకంగా అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రకంగా పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని వారు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెంచినటువంటి నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని వారన్నారు. ప్రతి ఒక్క పార్టీ సభ్యుడు పార్టీ ఇచ్చే పిలుపులో పాల్గొని పాలకుల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరు సమరసిల పోరాటానికి ముందుకు రావాలని వారు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో పాటు శాఖ సభ్యులు పాల్గొన్నారు.

పంటకోతల్లో రైతన్నలు బిజీ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : రబీలో వర్షాధారంగా సాగుచేసిన పంటల దిగుబడి ఇప్పుడిప్పుడే రైతుల ఇంటికి చేరుతున్నది. పప్పు సెనగ జొన్న ధనియాల తదితర పంటల కోతల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. కొన్ని గ్రామాలలో అన్నదాతలు పంట కోతలకు కూలీల కోసం పరుగు పెడుతున్నారు. రబీ ప్రారంభంలో భారీ వర్షాలు కురవడంతో సెనగ, ధనియాల,తెల్లకుసుమ పంటల సాగు రెండు వారాలు ఆలస్యమైంది. పంటల పై ప్రభావం చూపటంతో దిగుబడి అంతంత మాత్రమే ఉన్నది.జొన్న దిగుబడి మాత్రం ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు తెలిపారు.మొగిలి దెబ్బకు పంటల దిగుబడి కుదేలైనట్లు రైతన్నలు భావిస్తున్నారు. సెనగ ధనియాలు పంట కోతలు 4 రోజుల క్రితం ప్రారంభం కాగా, జొన్న 10రోజుల పై కావస్తున్నది. మండలంలోని కొలిమిగుండ్ల బెలూన్ మీర్జాపురం నందిపాడు ఎర్రగుడి నాగశెట్టిపల్లి హను మంతు గుండం పెద్దవెంత్రుల కమ్మవారి పల్లి కుమ్మాయిపల్లి కోటపాడు తిమ్మ నాయుని పేట తదితర గ్రామాల పరిధిలో విస్తారంగా పప్పు శనగను రైతన్నలు సాగు చేయగా అక్కడక్కడ ధనియాలు జొన్న తెల్లకుసుమ పంటలను వేశారు. మండల పరిధిలో పప్పు సెనగ 12వేల ఎకరాలు ధనియాలు వెయ్యి ఎకరాలు జొన్న 800ఎకరాలు తెల్ల కుసుమ 700ఎకరాలలో రైతులు సాగు చేశారు. సెనగ నాలుగు నుండి ఆరు క్వింటాలలోపు, జొన్న ఐదు నుండి ఆరు క్వింటా లలోపు ధనియాలు రెండు క్వింటాలలోపు దిగుబడి మాత్రమే వస్తున్నట్లు రైతులు తెలిపారు.

గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న బీసీ

విశాలాంధ్ర - బనగాన పల్లె : నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బిసి బ్రదర్స్ మండలం పరిది లోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన చిదిగే రాజగోపాల్ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, పాల్గొన్నారు.

పేద బాలికలకు రఘురాం వితరణ

విశాలాంధ్ర - వెలుగోడు : తాను సంపాదించిన సొమ్ములో కొంత సమాజంలో ని పేదలకు సహాయం చేసినప్పుడే నిజమైన సార్ధకత పొందుతారని సీనియర్ జర్నలిస్ట్, జాతీయ బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘు రాముడు యాదవ్ పేర్కొన్నారు. స్థానిక స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాధ బాలికల వసతి గృహంలో ఆదివారం తన పుట్టినరోజును నిరాడంబరంగా జరుపుకున్నారు. ప్రతి పుట్టినరోజుకు ఏదో ఒక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు సహాయం చేయడం అభినందనీయమని వక్తలు కొనియా డారు. బాలికలకు నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. బి.సి. సంఘం నాయకులు నాగేశ్వరరావు యాదవ్,నాగన్న, ఎల్లయ్య, రాఘవేంద్ర యాదవ్, స్టార్ యూత్ ప్రతినిధి ఖాదర్, వలి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర - అవుకు : పట్టణంలోని ఈబీసీ కాలనీకి చెందిన సాయి సుజాత (20)అనే యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాయి సుజాత గత ఆరు నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదనీ పలు ఆస్పత్రులలో చూపించుకున్న ఆరోగ్యం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆమె తల్లి శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతి చెందిన యువతి టీటీసి వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉండేది. యువతి తండ్రి ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. ఆయన మండల ప్రజలకు సుపరిచితుడే. మండలంలోని కునుకుంట్ల, ఉప్పలపాడు, సంఘపట్నం గ్రామాల్లోని పాఠశాలల్లో పాటు పలు గ్రామాలలోని పాఠశాలల్లో సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు.

మూత్రపిండాల జబ్బుల పట్ల అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర - నంద్యాల : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలోబాలాజీ కిడ్నీకేర్ ఆసుపత్రి నిర్వహణలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జఫ్రుల్ల, డాక్టర్ చంద్రశేఖర్‌ల పర్యవేక్షణలో,అరిస్టో కంపెనీ సౌజన్యంతో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా కిడ్నీ జబ్బుల పై జరిగిన సదస్సులో ప్రముఖ యూరాలజీ నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ప్రముఖ నెఫ్రాలజీ నిపుణురాలు డాక్టర్ కీర్తి రెడ్డి ప్రసంగించారు. నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ జఫ్రూల్లా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తాను చేసిన అరుదైన మూత్రపిండాల శస్త్ర చికిత్సలను, డాక్టర్ కీర్తి రెడ్డి మూత్ర పిండాల జబ్బులు ముందస్తు జాగ్రత్తలపై మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వైద్య వైద్య పూర్తి చేసిన తర్వాత వైద్య సేవలు అందించే క్రమంలో భాగంగా నిరంతరం వైద్య విజ్ఞానంలో వస్తున్న మార్పులను, ఆధునిక విధానాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంటుందని తద్వారా మాత్రమే రోగులకు మెరుగైన సేవలు అందించగలమని, అందుకోసమే ఈ నిరంతర వైద్య విద్య కార్యక్రమాలకు ప్రతి వైద్యుడు తప్పనిసరిగా హాజరు కావలసిన అవసరం ఉందని అన్నారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ కీర్తిరెడ్డిలకు జ్ఞాపికలు ఐఎంఏ తరపున అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జఫ్రుల్లా, డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ పనిల్ అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

అపూర్వ విద్యార్థుల కలయిక

- 45 సంవత్సరాల తరువాత మిత్రుల ఆత్మీయ కలయిక
- కళాశాల అభివృద్ధిలో తోడ్పాటుకు తీర్మానం

విశాలాంధ్ర - డోన్ : ఆనాటి విద్యార్థులు.....నేడు వివిధ వృత్తుల్లో.... ఉద్యోగాల్లో స్థిరపడ్డారు....ఎలాగైనా కలవాలని కొంతమంది నిర్ణయించుకున్నారు. వేదికగా డిగ్రీ కళాశాలను ఎంచుకున్నారు. 45 సంవత్సరాల తరువాత కలిసిన మిత్రులను ఒకరికొకరుఆప్యాయంగా పలకరించుకుంటూ పులకించిపోయారు. అలనాటి మిత్రుల ఆత్మీయ కలయికలో గడిపిన ఎన్నో మధురమైన క్షణాలకు డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా నిలిచింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలనే ఆలోచనకు ఆలంకొండ నబి సాహెబ్,ఆలా మోహన్‌రెడ్డి,ఆంజనేయులు,కొండాసురేష్,వరిగడ్డి వెంకటేశ్వర్లు లు కార్యాచరణ రూపొందించారు. వివిధ ప్రాంతాలలో ఉన్న పూర్వ విద్యార్థులకు సమాచారం అందించి అందర్నీ ఒకే వేదిక పైకి తీసుకురావడంలో సఫలీకృతమయ్యారు.ఆదివారం పట్టణంలోని స్థానిక ప్రభు త్వ డిగ్రీ కాలేజ్ లో 1978నుంచి 1986వరకు విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అలనాటి మిత్రుల కలయికతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

కళాశాల అభివృద్ధికి కృషి : కళాశాలకు కనీస వసతులు లేని నాటి రోజులలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను నేడు కళాశాలలో చదువుకుంటున్న పేద మధ్య తరగతి విద్యార్థులు ఎదుర్కోకుండా ఉండటానికి తమ వంతు సాయం

అందించాలని తీర్మానించుకున్నారు.కళాశాలలో ఉన్న సైన్స్,డిజిటల్ ల్యాబ్ లు త్రీ ఫేస్ విద్యుత్తు లేని కారణంగా నిరుపయోగంగా ఉండటంతో కళాశాలకు త్రీఫేస్ విద్యుత్తు ఏర్పాటు, కళాశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేద్దామని ఆలంకొండ నబీసాహెబ్ ప్రతిపాదించగా పూర్వ విద్యార్థులందరూ ముక్తకంఠంతో అంగీకారం తెలిపి అక్కడికక్కడే విరాళాలు కూడా ప్రకటించి తాము ఉన్నత స్థాయిలో నిలవడానికి దోహదపడ్డ కళాశాలకు తమవంతు తోడ్పాటునందించి కాలేజీ పై ఉన్న ప్రేమను చాటుకున్నారు.పూర్వ విద్యార్థులందరూ ఒకరికొకరు సహాయ సాకా రాలు అందించుకోవాలని కోరారు. కళాశాల పూర్వ విద్యార్థులు ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ కెజియా ప్రసూన,డిఆర్ఓ పుల్లయ్య, సీఐ గౌస్, కమర్షియల్ టాక్స్ అధికారి విజయ భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు ఎన్ ఎస్ బాబు,డోన్ టిడిపి ఇన్చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి,ప్రముఖ న్యాయవాదులు నాగభూషణ్ రెడ్డి,ఎస్టీ హరుణ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, జయచంద్ర రెడ్డి,ఎస్టి గుల్షన్,బుర్రుశ్రీధర్‌నాయుడు,వెంకటరమణ,పంచాయతీ సెక్రెటరీ రాజేశ్వరరావు,కురిమెట్లనారాయణ,వ్యాయామఉపాధ్యాయురాలుపద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా న్యూక్లియర్ కళాశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పద్మావతినగర్‌లో న్యూక్లియర్ జూనియర్ కళాశాల వార్షిక దినోత్సవాన్ని డివైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ మురళీధరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎంపిసి విద్యార్థినిలు ఎం అలీనా, జి చందన, సీఇసి నందు శృతి, బైపిసి నందు కళాశాల టాపర్స్ గౌరీ చరిత, శృతి, మిగతా టాపర్స్ ని అభినందించారు. కళాశాల డైరెక్టర్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, కళాశాలకు మంచిర్యాంకులు తీసుకుని రావాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. కళాశాలకు మంచి ఫలితాలు వచ్చేలా కృషిచేసిన బోధన, బోధనేతర సిబ్బందిని అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాల సంబరాలు అంబరాన్ని అంటాయి.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయుసి అను బంధం సమావేశం స్థానిక నాయకుడు సూర్యచంద్రుడు అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సురేంద్రలు మాట్లాడుతూ దాదాపుగా మూడున్నర సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని, కార్మికులు తమ సంక్షేమం కోసం దరఖాస్తులు చేసుకొని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని,ఒకవైపు ఇసుక కొరత, మరోవైపు రోజు రోజుకు నిర్మాణ సామాగ్రి రేట్ల పెరుగుదలతో వారి జీవనోపాధిపై రోకలి పోటుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్ష,సలహాదారులుగా సూర్యచంద్ర,ఇమ్మానుయేల్.అధ్యక్ష కార్య దర్శులుగా లక్ష్మణ్,కాశీం కోశాధికారిగా ఓ.రాజు,ఉపాధ్యక్షులుగా షేక్ష,సెంట్రింగ్ రాజు, సహాయ కార్యదర్శిగా చిరంజీవి,అలీ హుస్సేన్, తదితర సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ సభ్యులు, సీపీఐ అనుబంధం సంఘాలు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మాణాలు.... ఆగుతూ.... సాగుతూ

విశాలాంధ్ర-చాగలమర్రి : గాంధీ కోరిన గ్రామ స్వరాజ్య పాలన సాగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రభుత్వం గ్రామాల్లో జనాభా ప్రకారం గ్రామ సచివాలయాల నిర్మాణాలు చేపట్టాలని మంజూరు చేసింది. ఒక్కో గ్రామ సచివాలయానికి రూ. 40 లక్షల నిధులను మంజూరు చేసింది. 2020వ సంవత్సరం నవంబరు నెలలో సచివాలయ నిర్మాణాలను మంజూరు చేసింది. గత రెండేళ్లుగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామ సచివాలయ సిబ్బంది గతంలో ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే విధులు నిర్వహించాల్సి వస్తుంది. సచివాలయ సిబ్బందికి వచ్చిన పరికరాలు,తదితర వాటిని ఉంచడానికి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి మండలంలో 17 సచివాలయాలకు గాను 9 సచివాలయాలు పూర్తయ్యాయి. మండలంలోని చిన్నవంగలి గ్రామ సచివాలయం దాదాపు పూర్తయ్యే స్టేజిలో నిలిచి పోయింది. ఆ సచివాలయం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కట్టడంతో నిలిచిపోయింది. మండలంలోని మల్లెవేముల, పెద్దవంగలి. చింతల చెరువు, శెట్టివీడు, గొడిగనూరు, చాగలమర్రిలో రెండు సచివాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి.ఓ వైపు బిల్లులు అందక మరో వైపు మెటీరియల్ సక్రమంగా రాక నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.అధికారులు స్పందించి సచివాలయాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయా లని పలువురు కోరుతున్నారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు: కొండారెడ్డి, (పంచాయతీరాజ్ ఇంజనీర్) గ్రామ సచివాలయాల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.కొన్నిచోట్ల నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. వేగంగా పూర్తి చేయాలని సంబంధించి గుత్తేదారులకు సూచిస్తున్నాం. పెండింగ్‌పడి నిలిచిపోయిన వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

వైసీపీకి వణుకు పుట్టిస్తున్న నారా లోకేష్

విశాలాంధ్ర-బనగానపల్లె : నారా లోకేష్ తలపెట్టిన పాదయాత్ర వైసీపీ పార్టీకి వణుకు పుట్టిస్తుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక తెలుగుదేశం కార్యాలయం నందు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ జగన్ రెడ్డి మోసాలు, ప్రభుత్వ డొల్లతనాన్ని కప్పిపుచ్చేందుకే జీఓ-01 జగన్ రెడ్డి పేద ప్రజలకు సంక్షేమం పేరుతో చేస్తున్న మోసాలు, మోసకారి సంక్షేమ పథకాలు, ప్రభుత్వ డొల్లతనం, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకత బయటపడుతున్నాయనే అక్కసుతో, కక్షపూరితంగా జీఓఆర్టీ-01ను జగన్ రెడ్డిని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు పూర్తిగా ద్రోహం చేస్తూనే ఉందని చంద్రబాబు తన రోడ్ షోలు , బహిరంగ సభల్లో బయటపెడుతున్నారని జగన్ రెడ్డి వెన్నులో వణుకు మొదలైంది. ఏదో ఒక విధంగా చంద్రబాబు రోడ్ షోలు, బహిరంగ సభలు, జనవరి-27న లోకేష్ పాదయాత్రలను ఆపాలనే దురుద్దేశంతో కందుకూరు, గుంటూరు ఘటనలను ఆధారంగా చేసుకుని జీఓఆర్టీ-01ను తెచ్చారు. ఈ జీఓను తీసుకురావడానికి జగన్ సర్కార్ 11మంది పేదవాళ్లను కుట్ర పూరితంగా హత్యచేసి ఆ నెపాన్ని చంద్రబాబుకు ఆపాదిస్తూ దుష్ప్రచారం చేస్తోంది. జీఓఆర్టీ-01 తీసుకురావడంతో కందుకూరు ఘటనలో వైసీపీ కుట్రకో ణం ఉందని మాకు అనుమానా లున్నాయి. ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జావీద్ హుస్సేన్, నంద్యాల జిల్లా వాణిజ్య విభాగ చైర్మన్ టంగుటూరు సీనయ్య, వార్డ్ మెంబర్ ఖాసింబాబు, ఫకీర్ రెడ్డి, సలాం, మద్దిలేటి రెడ్డి, లాయర్ నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలోని గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి మండలం లోని నల్లగట్ల గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమం, అభివృద్ధి గురించి తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైకాపాకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, సర్పంచ్ రామ కృష్ణ,వైసిపి నాయకులు విజయ చంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి,వెంకటసుబ్బారెడ్డి, ఓబులం పల్లి నాయకులు రామ్మోహన్ రెడ్డి, కోట కందుకూరు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పేరుగొప్ప ఊరు దిబ్బగా నంద్యాల

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల అందం మేడి పండు చందంగా మారిందని, పేరు గొప్ప.. ఊరు దిబ్బగా నంద్యాల తయారైందని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అబ్దుల్ సలాం విమర్శించారు. నంద్యాల ఐయుఎంఎల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మౌలానా అబ్దుల్ సలాం మాట్లాడుతూ నందమూరినగర్ రహదారి వంతెనపై రంగులు కొట్టి తూతూ మంత్రంగా అభివృద్ధి చేశామంటున్నారని, అలాగే పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు చిన్నపాటి లైటింగ్ అమర్చితేనే అభివృద్ధి జరిగినట్లా అని ఆయన ప్రశ్నించారు. పద్మావతినగర్ రహదారి పద్మావతినగర్ ఆర్చి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు మట్టి, దుమ్ము, ధూళితో నిండిపోయిందని, ప్రజలకు దగ్గు, జలుబు, అలర్జీ వస్తుందని, పద్మావతినగర్ లో స్థలాలు కోట్లు పలుకుతున్నాయని, లక్షల్లో మున్సిపాలిటీకి ఆదాయం వస్తున్నా ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర - నంద్యాల : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష నంద్యాల జిల్లాలోని 33 పరీక్షా కేంద్రాల్లో 17, 331 మంది అభ్యర్థులు హాజర య్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్, తదితర అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి సెంటర్‌కి దాదాపు పది మంది సిబ్బందిని నియమించామని, సీఐ, డిఎస్పిలతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో 17,331 మంది పరీక్ష రాస్తుండగా, ఇందులో పురుషులు 13142 మంది, మహిళా అభ్యర్థులు 3092 మంది హాజరు కాగా,1092మంది గైర్హాజరైనట్లు ఎస్పీ తెలిపారు.

బిజెపి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విశాలాంధ్ర - నంద్యాల : బిజెపి ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, విశాఖ ఉక్కును కాపాడుకుంటామని ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 23, 24 తేదీలలో రెవెన్యూ ఆఫీసుల వద్ద దీక్షలు, 25వ తేదీ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు తెలిపారు. 27వ తేదీ విశాఖలో జరిగే మహా గర్జనకు నంద్యాల ఏఐటిసి సమితి మద్దతుగా నంద్యాల జిల్లా సిపిఐ కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు సుబ్బరాయుడు, కలాం, ఈశ్వరమ్మ, అన్వర్‌భాష, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మున్సి పాలిటీ పరిధిలోని రామలక్ష్మి కొట్టాలలోని డ్రైనేజీల సమస్యను వారం రోజుల్లో అధికారులు పరిష్కరించాలని లేకుంటే సంబంధిత కాలనీ వాసులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని మాజీ మంత్రి, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు. ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆదివారం 20వ వార్డు టిడిపి కౌన్సిలర్ హుస్సేన్ భాష తో కలిసి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ రామలక్ష్మి కొట్టాలలో పర్యటించారు. ఆమె కాలనీలోని ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ సరిగా లేదని, మురికి నీరు పోవడం లేదని దీంతో దోమలు ఎక్కువ అయి అంటువ్యాధులు ప్రభలుతున్నాయని కాలనీవాసులు అఖిలప్రియ దృష్టికి తెచ్చారు. మాజీమంత్రి భూమా అఖిలప్రియ విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గ్రామాలలో కొంత బాగుందని ఇక ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. రామలక్ష్మి కొట్టాలలో తాను స్వయంగా చూశానని కాలనీ వాసుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. దోమల వ్యాప్తితో అంటూ రోగాలు ప్రబలుతున్నాయని ఆమె వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులు ఒకరోజు ఈ కాలనీలో ఉంటే వారికి పరిస్థితి తెలుస్తుందన్నారు. వారం రోజుల్లోగా రామలక్ష్మి కొట్టాలలోని సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుట తాను ధర్నాకు దిగుతానని ఆమె హెచ్చరించారు. వైసిపి నాయకుల ఒత్తడితో అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఒక్కసారి ఛాన్స్ ఇవ్వాలంటూ వైయస్ జగన్ అడిగి ముఖ్యమంత్రి అయ్యారని ఈసారి మన ఎమ్మెల్యే నాకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను అడుగుతున్నారని ఆయన ప్రజలకు ఏమి చేశారో చెప్పాలన్నారు.ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో అవకతవకలు చేసిన కాంట్రాక్టర్లను తాము అధికారంలోకి వస్తే బ్లాక్ లిస్ట్ లో పెడతామని ఆమె హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి పసల రాము యాదవ్, ఇటిక్యాల శేఖర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి చాంద్ భాష, నాగాంజనేయులు, అనంత రామ సుబ్బారెడ్డి, గుండా మనోహర్, అబ్దుల్ సలాం, టిడిపి మహిళ నాయకురాలు నూర్జహాన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కన్వీనర్‌గా మద్దయ్య

విశాలాంధ్ర-బనగానపల్లె : మండలంలోని జోలాపురం గ్రామానికి చెందిన సీనియర్ విలేకరి జి మద్దయ్య యాదవ్ ను అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. నంద్యాల పట్టణం లోని పద్మావతి నగర్ లోని శ్రీకృష్ణా టెంపుల్ లో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషువణియాదవ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు సింధు నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మద్దయ్య యాదవ్ ను బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బనగానపల్లె నియోజకవర్గ నాయకులు పాండురంగ యాదవ్, బాలుయాదవ్, బాల వీరభద్రుడుయాదవ్, గణమద్దిలేటియాదవ్, శ్రీనివాసులు యాదవ్, పిల్లి నాగయ్య యాదవ్,యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు..

ఏపీ హమాలీ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కర్నూలు : హమాలీ ముఠా రాష్ట్ర మహాసభలు జయ ప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం నందు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటియుసి నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వెంకటసుబ్బయ్య అంగన్వాడి రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ, జిల్లా కార్యదర్శి ఎస్ మునిప్ప, జిల్లా ఉప కార్యదర్శి ఆర్ కృష్ణయ్య, పాల్గొన్నారు. ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హమాలీ మూత రాష్ట్ర 3వ మహాసభలు తిరుపతి నగరంలో జనవరి 29, 30 తేదీలలో జరుగుతాయని రాష్ట్ర నలుమూలల నుండి హమాలీ ముఠా కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 50 లక్షల మంది హమాలి ముఠా జట్టు కాళసి కార్మికులు నిత్యం పనిచేస్తూ ప్రజలకు సర్వీసులు అందిస్తూ చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్నానన్నారు అలాగే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం వీరికి కూడా హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కొన్ని సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు మరియు కార్మికులు లోడింగ్ అన్లోడింగ్ పని చేసేటప్పుడు అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కాలు చేయి విరిగిన చనిపోయిన ఆదుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సామాజిక భద్రత చట్టం క్రింద హమాలి కార్మికులకు ఈఎస్‌పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తిరుపతిలో జరిగే మూడో హమాలి రాష్ట్ర మహాసభల్లో దాదాపు 5000మంది పాల్గొంటారని 500మంది ప్రతినిధులతో నిర్వహిస్తామని వారు చెప్పారు. ఈ మహాసభ భవిష్యత్తులో హమాలీల కోసం జరిగే పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు కేంద్రం నుంచి హమాలీ సంఘం నేతలు మరియు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వారు చెప్పారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి టి రామాంజనేయులు కార్మికులు రామకృష్ణ సోమన్న గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు శాపంగా మారిన జీవో 21ని రద్దు చేయాలి

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : ఆటోలు, మోటార్ వాహనాలపై భారీగా జరిమానాలు పెంచుతూ, ఆటో రంగ రవాణా కార్మికులపై శాపంగా మారిన రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేసిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ఈశ్వర్, ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు ఎం. నరసరావు,లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి అనుబంధం) ఆధ్వర్యంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎమ్.నెట్టేకల్ అధ్యక్షతన టర్నింగ్ ఏఐటీయూసీ కార్యాలయం నందు ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో అండ్ మోటార్ వాహనాలపై పెండింగ్ లో ఉన్న పోలీస్ ఈ చలానాలు రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న గోతుల రోడ్లను పక్కాగా వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని తెలిపారు. పెంచిన డీజీలు, పెట్రోలు, వంటగ్యాస్, విద్యుత్, ఇంటి పన్ను, చెత్త పన్నులు రద్దుచేసి ఆటో డ్రైవర్ల కుటుంబ సభ్యులకు జీవన ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో అండ్ మోటార్ వాహనాలపై పెంచిన గ్రీన్ టాక్స్, రోడ్ టాక్స్, టోల్ పంజా ఫీజులు, గ్యాస్ ధరలను రద్దు చేయాలన్నారు. డ్రైవర్లకు మెకానిక్‌లకు పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.స మండల కార్యదర్శి ఎమ్. వెంకటేశ్వర్లు, ఏఐటీయుసి, ఆటో యూనియన్ మండల నాయకులు దస్తగిరి, చిన్న,ఉస్మాన్,రామ్ లక్ష్మణ్ బడే సాహెబ్, రాఘవేంద్ర, రంగడు, ఆటో శంకర్, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : ఆటో రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం (ఏఐటీయూసీ అనుబంధ) ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కుంకునూరు టర్నింగ్ నందునూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా చిన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉస్మాన్, ప్రధాన కార్యదర్శిగా రామ్ లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ స్వామి, మేకల దస్తగిరి, రామస్వామి, ఉపాధ్యక్షులుగా వీరేశు , వెంకటేశు, బ్రహ్మ, కోశాధికారిగా రాఘవేంద్ర లతోపాటు 23 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ఈశ్వర్, ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు ఎం. నరసరావు లు తెలిపారు.

నారా లోకేష్‌ను కలిసిన టిజి భరత్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టీజి భరత్ కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి లోకేష్ చేపట్టబోయే యువ గళం పాదయాత్ర విజయవంతం అవ్వాలని కోరుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా పాదయాత్ర చేపట్టినన్ని రోజులు ఆయనకు సంపూర్ణం ఆరోగ్యం కలిగి ఉండాలని కోరుకున్నట్లు భరత్ తెలిపారు. టిడిపికి ప్రజల నుండి ఊహించని రీతిలో మద్దతు లభిస్తోందని చర్చించుకున్నామన్నారు. కర్నూల్లో యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు వివరించినట్లు భరత్ చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు లోకేష్‌తో మాట్లాడినట్లు తెలిపారు. కాగా లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా సాఫీగా జరిగేట్లు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నానన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా పాదయాత్రలు చేసే హక్కు ఎవరికైనా ఉందన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని యాటకల్లు గ్రామంలో ఈనెల 24, 25వ తేదీలలో జరుగు శ్రీ సుంకులమ్మ ఊరి దేవర సందర్భంగా ఏఐవైఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో తాలూక స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. ఊరుదేవర సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో ప్రథమ స్థాయిలో నిలిచిన జట్టుకు రూ. 8,016లు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.6,016లు, మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 3,016 నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈటోర్నమెంట్ 24వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, కావున 23వ తేదీ సాయంత్రం లోపు తమ టీం పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఫోన్ నెంబర్ 6281971243 కు కాల్ చేసి పాల్గొనే జట్టు వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

భూసాములకే జగనన్న ఇంటి పట్టాలు

విశాలాంధ్ర - నందవరం : ముగతి గ్రామంలో భూసాములకే జగనన్న ఇంటి పట్టాలు మంజూరు చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి,మండల కార్యదర్శి గిడ్డయ్య,అన్నారు. ఆదివారం మండలపరిదిలోని ముగతి గ్రామంలో జగనన్న కాలనిలో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ. జగనన్న ఇంటి నిర్మాణానికి 5 లక్షలు మంజూరు చేయాలని,ఆదివారం జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ఇస్తున్న 1,80,000ను 5 లక్షలకు పెంచాలన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగనన్న కాలనీలో పేరుతో నిర్మిస్తున్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ప్రస్తుతం ఉన్న ధరలకు లక్ష, 80,000 ఏమాత్రం సరిపోదని, లబ్ధిదారులు అప్పులు చేసుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, అర్జున్ రెడ్డి,సోమేష్,అప్పన్న పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర -హొళగుంద : ఎంపీపీ నూర్జహాన్ తనయుడు ఈసా వైకాపా మండల కన్వీనర్ షఫీ ఉల్లా ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌బి అంజాద్ భాషను వైకాపా నాయకులు మైనార్టీలు కలిశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషాకు హొళగుంద మైనార్టీల కబరస్తాన్ గోడ డ్రైనేజ్ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని మసీదు ఈద్గాల అభివృద్ధికి కృషి చేయాలంటూ కోరారు అలాగే మైనార్టీ యువతులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ ముస్లిం సోదరులు వైకాపా పార్టీకి అండంగా నిలిచి రాష్ట్రంలో వైకాపా పార్టీ అధికారంలోకి తీసుకోరావడానికి కృషి చేశారని వైకాపా నాయకులు మంత్రికి తెలిపారు. మైనారిటీలకు ఇండ్ల స్థలాలు బ్యాంకు రుణాలు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు సొదీ భాష,జబ్బార్ షఫీ, హమీద్,ఫాజిల్,రషీద్,వలి, మహబూబ్ బాషా ,హనీఫ్,అమీన్, సుభాన్, మౌల్విహబీబుల్లా,కురవధరగప్ప, ఈరన్న పాల్గొన్నారు. ఎంపీపీ నూర్జహం తనయుడు ఈసా మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆలూరు వైకాపా ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ భాషను కలిసి సమస్యలను వివరించామని అన్నారు.

టిడిపితోనే అభివృద్ధి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎంతో కొంత అభివృద్ధి చెందాలంటే ఆ ఘనత టిడిపికే దక్కుతుందని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ జిల్లా కోఆర్డినేటర్ సముద్రాల హనుమంతరావు అన్నారు. ఆదివారం నగరంలోని భంగినంతయ్య కాంప్లెక్స్ లోని బ్రాహ్మణ సంక్షేమ సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సంగతి అందరికీ తెలిసిందేనని, పేద బ్రాహ్మణులకు సప్త ఋషుల పేరట ఉపయోగపడే పథకాలను రూపొందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వంకే దక్కు తుందన్నారు. 13 జిల్లాల్లో డిస్టిక్ కోఆర్డినేటర్లను నియమించి వచ్చిన వడ్డీతో కార్పొరేషన్ భవనాన్ని నిర్మించి బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ స్థాపించారన్నారు.

దేవరగట్టులో భక్తుల రద్దీ

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని నేరణికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువ కనిపించింది, స్వామివారికి పూజారులు వంపయ్య స్వామి మహేష్ స్వామి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ప్రతి మెట్లకు కుంకుమ బండారాన్ని పూశారు భక్తులు సాష్టాంగ నమస్కారాలు వేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షా కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - కర్నూల్ క్రైమ్ : కర్నూలు నగరంలోని సుంకేశుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ కళాశాల, ఎ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్, సిల్వర్ జూబ్లీ కళాశాల, కెవి. సుబ్బారెడ్డి కళాశాలల పరీక్ష కేంద్రాలను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రిలిమినరీ రాత పరీక్ష జరుగుతుందన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 48పరీక్ష కేంద్రాలలో 21.421మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. 1209మంది పరీక్షకు హాజరు కాలేకపోయారు.(పురుష అభ్యర్థులు 18, 117,మహిళా అభ్యర్థులు 4,513) అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మాల్ ప్రాక్టిస్ లేకుండా గట్టి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, డిఎస్పీలు వెంకటరామయ్య, యుగంధర్ బాబు, శ్రీనివాసులు,కెవి మహేష్, రాజకుమార్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి మంత్రి విరాళం

విశాలాంధ్ర-ఆలూరు : జిల్లా, నియోజకవర్గ పరిదిలోని ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం పట్టణంలోనే మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆస్పరి మండలం, డి.కోటకొండ గ్రామపంచాయతీ మజారా గ్రామమైన బైలుపత్తికొండ గ్రామంలో శ్రీ సుంకలమ్మ దేవాలయం నిర్మాణం కోసం మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ల చేతుల మీదుగా రూ. 50 వేలను విరాళంగా డి.కోటకొండ గ్రామ పంచాయితీ సర్పంచ్ భర్త బి.టి రంగన్న, గ్రామ పెద్దలకు అందజేశారు. మంత్రి జయరాం మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందనీ, దేవస్థానం నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు.నిర్మాణంలో భాగస్వామ్యం కావడం గర్వాంగా ఉందని పేర్కొన్నారు.వైసీపీ నాయకులు రామలింగ,నరసింహులురమణయ్య,బసవరాజు,సుధలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని వినతి : రాష్ట్ర బీమా వైద్య శాఖ ఏపీ-ఔట్ సోర్సింగ్ నర్సింగ్ పారా మెడికల్ ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ నుండి కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ నర్సింగ్ పారా మెడికల్ ఉద్యోగులు పద్మజా రెడ్డి, రాంజనేయాలు, అనురాధ, రాజేష్ లు మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతి పత్రాన్ని అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకువెళ్లి మీ సమస్యలను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలి

విశాలాంధ్ర - చిప్పగిరి : వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయం తెలిసినదే ఇందుకుగాను ఆదివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండల పరిధిలోని నగర డోనా గ్రామ సర్పంచ్ మల్లమ్మ ఆధ్వర్యంలో రిటైర్మెంట్ ఐఏఎస్ అధికారి శ్యామల ఆనంద్ కుమార్ నియంతృత్వంలో ఎస్టీ కమిషనర్ బృందం పర్యటించారు. వారు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిప్పగిరి మండల పరిధిలోని రామదుర్గం, నగర డోనా గ్రామాలను పర్యటించడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో భాగంగా సెంట్రల్ యూనివర్సిటీ సుమలత ఆధ్వర్యంలో వాల్మీకులను కలుసుకొని వాల్మీకుల నాగరికతపై వివరాలు సేకరించడం జరిగిందన్నారు. వాల్మీకుల అభివృద్ధి పైన, ఆచారాలను, క్షుణ్ణముగా అడిగి తెలుసుకోవడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫార్మేట్ ప్రకారం వాల్మీకుల (బోయ) నుండి వివరాలు సేకరించి పంపించడం జరుగుతుందన్నారు.

సాగు,త్రాగునీరుకు భూమి పూజ

విశాలాంధ్ర-కోసిగి : నియోజకవర్గ పరిధిలోని ప్రజల దీవెనలే మాకు కోండంత అండని మంత్రాలయం శాసన సభ్యులు వై.బాలనాగి రెడ్డి అన్నారు. ఆదివారం కోసిగి గ్రామ సమీపాన ఉన్న పులి కనుమ రిజర్వాయర్ నుంచి సాగు,త్రాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, యంపీపీ ఈరన్న,మండల ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డి అధ్యక్షతన శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ,పులికనుమ రిజర్వాయర్ నుంచి 20 క్యూసెక్ల నీటి సామర్థ్యంతో 4.6 కిలో మీటర్ల మేర దాదాపు 5కోట్ల రూపాయలతో పెండేకల్లు, కోసిగి,నేల కోసిగి,నాకన్న చేరువు ప్రాంత భూములకు దాదాపు 2500వేల ఎకరాలకు సాగు అందివ్వడంతో పాటు కోసిగి గ్రామవాసుల త్రాగునీటి ఎద్దడికి నివారణకు శాశ్వత పరిష్కార మార్గాన్ని భూగేని చెరువు ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. 2009 ఎన్నికల తర్వాత కోసిగి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని అప్పటి ముఖ్యమంత్రి శ్రీ వైయస్ రాజశేఖ రరెడ్డి పిలుపు మేరకు పార్టీ మారడం జరిగిందని, వైయస్సార్ చనిపోవడంతో హామీ అక్కడితో ఆగిపోయిందని, 2019 ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి తనయుడు,యువనేత వై.ధరణీధర్ రెడ్డి కోసిగికి సాగు, త్రాగునీరు అందిస్తామని దైవసాక్షిగా ప్రమాణం చేయడం జరిగిందని, గత ప్రభుత్వ నాయ కులు వట్టి మాటలతో కాలయాపన చేయడంతో,కోసిగి గ్రామ వాసుల చిరకాల కోరిక పులికనుమ రిజర్వాయర్ నుంచి సాగు,త్రాగునీరు అందించేందుకు ఇచ్చిన మాటకు కట్టుబడి దివంగత నేత వైయస్సార్ కుమారుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన చేపట్టారు.ఈ ప్రాజెక్టు ద్వారా బీడు భూముల సాగుతో ఉపాధి అవకాశాలు పెరిగి వలసలు తగ్గుతా యన్నారు. జిఆర్పీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ మురళీ,ఏఈ శంకర్, గ్రామీణ నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి,మైనర్ ఇరిగేషన్ డీఈ కిష్టన్న,ఏఈ వెంకటేశ్వర్లు, యన్. నరసింహులు, బెట్టనగౌడ్, మహంతేష్ స్వామి,శ్రీనివాస రెడ్డి, యన్ నాగరాజు, బీమక్క,మంగమ్మ,జగదీష్‌స్వామి,హాజీఉస్మాన్,మాణిక్‌రాజు,రైతులు పాల్గొన్నారు.

వైకాపా మోసాలను ప్రజలు తిప్పి కొట్టాలి

విశాలాంధ్ర-హొళగుంద : హొళగుందలో ఆదివారం మండల టిడిపి కన్వీనర్ వీరన్న గౌడ్ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల టిడిపి కన్వీనర్ వీరన్న గౌడ్ మాట్లాడుతూ ఆలూరు తాలూకా టిడిపి ఇన్చార్జ్ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు ఇదేమి కర్మ అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వైకాపా పాలన వల్ల ప్రజలు నిసిగెత్తిపోయారని ఆరోపించారు. వైకాపా పాలన అధ్వానంగా మారిందని రాష్ట్రంలో దౌర్జన్య పాలనంగా కొనసాగుతుందని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి పార్టీని బలపరిచి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు తిక్కస్వామి, సిద్ధప్ప,సిద్దిక్,సాబ్,మరిస్వామి, పాల్గొన్నారు.

విద్యార్థుల కల సాకారం చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మంత్రాలయం : చినుకులు పడితే చాలు పాఠశాలలోకి అడుగులు వేయాలంటే వణకాల్సిన పరిస్థితి, అదనపు గదులు లేక ఆరుబయట విద్యా భోదన వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అందరిలాగా మాటలు చెప్పి మభ్య పెట్టడం మాకు రాదు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసి చూపుతామని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రాంపురం రెడ్డి సోదరులు పలు సందర్భాల్లో మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, విద్యార్థి సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై. సీతారామిరెడ్డి పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థ స్వామి వారితో చర్చించి నూతన పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు కు ఒప్పించారు. పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థ స్వామి చేతుల మీదుగా వై. సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ దశలో ఉన్న పనులను ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి స్వయంగా పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ లను ఆదేశించారు. ఎట్టకేలకు రూ 4 కోట్లతో నూతనంగా నిర్మించిన 24 గదులను ఆదివారం రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి, మహోపాధ్యాయ రాజా. యస్. గిరియాచార్ చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించగా,వై. సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల శిలాఫలకం ఆవిష్కరించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయ కులు థామస్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి ఉన్న సమయంలో అప్పటి డిప్యూటీ సీఎం కే.ఈ.కృష్ణ మూర్తి మంత్రాలయం వచ్చిన సందర్భంలో పాఠశాల సమస్యను వివరించేందుకు ప్రయత్నించడమే కాకుండా ఎన్నో వినతి పత్రాలు అందజేసిన ఫలితం శూన్యం. కాకపోతే అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అధికారంలోకి రాగానే చేసి చూపుతామని ఇచ్చిన మాట ప్రకారం నేడు పాఠశాల ప్రారంభోత్సవం చేసి విద్యార్థులు వారి తల్లిదండ్రుల గుండెల్లో మాట తప్పని మడమ తిప్పని నేతగా స్థానం పొందారని కొనియాడారు. అప్పట్లో సమస్యల పరిష్కారానికి ముందున్న సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైసీపీ మండల కన్వీనర్‌జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డిలకుప్రత్యేకంగాధన్యవాదములుతెలిపారు.ఎస్ఐవేణుగోపాల్‌రాజ్, ఎంఈవో మోహనుద్దీన్, సర్వ శిక్షా అభియాన్ ఇంజనీర్ కర్రెన్న, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సబ్జల్లి, కార్యకర్తలు, రాంపురం రెడ్డి సోదరుల అభిమానులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

విశాలాంధ్ర - మంత్రాలయం : పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ఘనత రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామంలో రూ 17.50 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను వైసీపీ నేత వై.సీతారామిరెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రారంభిం చారు. గ్రామ స్థాయిలోనే వైద్యం అందే విధంగా క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇరువురికి నాయకులు గజమాల వేసి శాలువ కప్పి సన్మానించారు. వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జి. భీమిరెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, పీఆర్ డీఈ అశ్వథామ, ఏఈ నర్సింహులు, కల్లుదేవకుంట వైద్య సిబ్బంది, సర్పంచ్ అంజిని, ఉప సర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామంలో టెంకాయల వేలం

విశాలాంధ్ర-ఆస్పరి : మండల పరిధిలోని ములుగుందం గ్రామంలో కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దస్తగిరి స్వాముల వారి 267వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన టెంకాయల వేలంపాట రెండు లక్షల 67 వేల రూపాయలకు ఆదోని పట్టణానికి చెందిన తాహెర్ బాషా పాట పాడి వేలంపాటను దక్కించుకున్నట్లు దర్గా పూజారులు తాత మునిమనుమలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ వేలం పాటలో మొత్తం ఏడు మంది వేలం పాటదారులు పాల్గొన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 43 వేలు దర్గాకు ఆదాయం పెరిగినట్లు తెలిపారు.

జగనన్న పథకాలు జనాలకు దూరం

విశాలాంధ్ర-మంత్రాలయం:నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని వగరూరు గ్రామంలో సిపిఐ పోరుబాటులో కార్యక్రమంలో భాగంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి డి.భాస్కర్ యాదవ్ జగన్ కాలనీలో లేవట్లను పరిశీలించి లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందుల్ని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ మోహన్ రెడ్డి మధ్యతరగతి ప్రజలను నట్టి విడుస్తున్నారు. అని అలాగే జనాలకు రైతులకు చేసింది ఏమీ లేదని వారు అన్నారు. ఒక్కొక్క ఇంటికి 11లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వ మాత్రం లక్ష 80వేల రూపాయలు ఇస్తే లబ్ధిదారులు డబ్బు సరిపోక ఇల్లు నిర్మించలేక పోతున్నారని వారన్నారు.కావున ప్రభుత్వం తక్షణమే లబ్ధిదారులకు 11 లక్షల రూపాయల వరకు ప్రతి లబ్ధిదారులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ మండల నాయకులు సంజీవయ్య నాయక్, మాబు, హుసేని, మహమ్మద్, అనీఫ్, హనుమంతు, ఖాదరు పాల్గొన్నారు.

వలస వెళుతున్న కూలీలు

విశాలాంధ్ర - కౌతాళం : స్థానికంగా ఇందిరా గాంధీనగర్‌వాసులు దాదాపుగా 25నుంచి 30కుటుంబాలు ఆదివారం గుంటూరుకు వలస వెళుతున్నట్లు కూలీలు తెలిపారు. సరైన సమయంలో వర్షాలు రాక పత్తి మిరప దిగుబడి చాలా అధ్వానంగా ఉన్నందున కనీసం పెట్టుబడి కూడా రానందున అప్పుల పాలైనట్లు రైతులు తెలిపారు. అప్పులు తీర్చడానికే వలసలు వెళ్లే పరిస్థితి వచ్చిందని రైతులు రైతు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా ఎవరు వచ్చినా మా స్థితిగతులను మార్చలేరని కాబట్టి మనకు వలసలే రైతులు విచారం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ భీమా పేదలకు వరం

విశాలాంధ్ర-పెద్దకడబూరు : వైఎస్సార్ భీమా పథకం పేదలకు వరం లాంటిదని వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డిలు అన్నారు. ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన రామాంజనేయులు కుటుంబానికి వైఎస్సార్ భీమా పథకం తక్షణ సహాయం కింద 10 వేల రూపాయల నగదును వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి అందజేశారు. మిగిలిన 90 వేల రూపాయలు మృతుని భార్య బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుం దన్నారు. మృతుడు రామాంజనేయులు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే మృతుని కుటుంబానికి వైఎస్సార్ భీమా ద్వారా 1 లక్ష మరియు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం కింద మరో 2 లక్షల రూపాయలు అందజేస్తామని తెలిపారు. వార్డు సభ్యులు బ్రహ్మయ్య ఆచారి, వైసీపీ నాయకులు కోరి నర్సింహులు, శాంతమూర్తి, ముని, రామాంజనేయులు, ఉసేనిసాబ్, ఈరన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

విశాలాంధ్ర-మంత్రాలయం : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంత్రాలయం ఎస్ఐ వేణు గోపాల్ రాజ్ తన సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్సీపీ నేత వై. సీతారామిరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ముందుగా స్థానిక పోలీసు స్టేషన్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. వాహనదారులను, ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మాట్లాడుతూ మానవ తప్పిదంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఏ వాహనం రికార్డులైన క్రమం తప్ప కుండా సకాలంలో ట్యాక్స్, ఇన్సూరెన్సు చెల్లించాల్సిన బాధ్యత మీపై ఉందని రికార్డులు సక్రమంగా లేని సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వర్తించదన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని,కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జి. భీమిరెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి ఉన్నారు.